క్లుప్తంగా

నెలాఖరున జనరిక్ దుకాణాలు ఆరంభిస్తాం

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు, శావల్యాపురం గ్రామాల్లో ఈనెలాఖరులోగా జనరిక్ మందుల దుకాణం ప్రారంభిస్తున్నట్లు శావల్యాపురం సొసైటీ చైర్మన్ నాగులపాటి చెన్నయ్య తెలిపారు. శనివారం స్థానిక సొసైటీ కార్యాలయంలో చైర్మన్ మాట్లాడుతూ కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల సారథ్యంలో రెండు గ్రామాల్లో జనరిక్ మందుల దుకాణాలు ప్రారంభం చేస్తామన్నారు. ఇందుకుగాను శావల్యాపురం సెంటరు సొసైటీ కార్యాలయం ఎదురు షాపులో, వేల్పూరులో సొసైటీ కార్యాలయంలో జనరిక్ మందుల దుకాణ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. అలాగే వేల్పూరులో సూపర్‌బజార్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు.

రేపటి నుంచి ఉచిత యోగ శిక్షణ

నరసరావుపేట ఈస్ట్: శ్రీవెంకటేశ్వర యోగ సేవా కేంద్రం నరసరావుపేట శాఖ ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదీ నుంచి నెలరోజుల పాటు శ్రీ పట్టాభిరామస్వామి దేవస్థానంలోని శ్రీవెంకటేశ్వర కల్యాణమండపంలో 172వ ఉచిత యోగ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు యోగా గురువు కూనిశెట్టి వెంకట జనార్ధన్ శనివారం తెలిపారు. ప్రతిరోజు ఉదయం 5 గంటల నుంచి 7 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానం, సూర్య నమస్కారాలు, ఆహార నియమాలు బోధిస్తామన్నారు. సంపూర్ణ మానసిక, శారీరక ఆరోగ్యానికి యోగ దోహదపడుతుందని వివరించారు. వివరాలకు కన్వీనర్ కూనిశెట్టి అనూరాధ 9491665733, 9490846333 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

లోక్ అదాలత్‌లో 234 కేసులు పరిష్కారం

వినుకొండ(నూజెండ్ల): స్థానిక వినుకొండ జూనియర్ సివిల్‌కోర్టులో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో 234 కేసులు రాజీ అయ్యాయి. జడ్జి రామ్మోహన్ ఆధ్వర్యంలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో 194 క్రిమినల్ కేసులు, 40 సివిల్ కేసులు పరిష్కారమయ్యాయి. కార్యక్రమంలో బార్‌ల అసోసియేషన్ అధ్యక్షులు చాగంటి వీరాంజనేయ చౌదరి, తోపాటు న్యాయవాదులు, పోలీసులు కక్షిదారులు పాల్గొన్నారు.

అమ్మవారికి కలువ పూలతో అలంకరణ

నాదెండ్ల: గణపవరంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో శ్రావణ మాసం సందర్భంగా కన్యకా పరమేశ్వరి అమ్మవారికి కలువ పూలతో అభిషేకాలు నిర్వహించారు. ముందుగా అమ్మవారికి కలువ పూలతో అలంకరించి అభిషేకాలు జరిపారు. ఆలయ పూజారి దర్భి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో సామూహిక వ్రతాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు పర్యవేక్షించారు. ఆదివారం పునర్వసు నక్షత్రం సందర్భంగా కోదండ రామస్వామికి విశేష పంచామృతాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ పూజారి అనిల్‌కుమార్ తెలిపారు. సాయంత్రం 6 గంటలకు అభిషేకాలు ప్రారంభమౌతాయన్నారు.

సబ్సిడీపై గడ్డి కత్తిరించే యంత్రాలు సిద్ధం



సత్తెనపల్లి: ప్రభుత్వం పశుపోషకులకు సబ్సిడీపై గడ్డి కత్తిరించే యంత్రాలు (చాప్‌కట్టర్) పంపిణీ చేస్తోందని పశుసంవర్ధకశాఖ సత్తెనపల్లి సహాయ సంచాలకులు డాక్టర్ మంగు శ్రీనివాసరావు శనివారం తెలిపారు. వివిధ మండలాల్లోని పశుపోషకులకు సరఫరా చేసేందుకు సత్తెనపల్లి ఏరియా పశువైద్యశాలలకు ప్రభుత్వం 21 చాప్‌కట్టర్ యంత్రాల్ని సరఫరా చేసినట్లు చెప్పారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా 40 శాతం సబ్సిడీతో పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. 2 హెచ్‌పీ, 3 బ్లేడ్ చాప్ కట్టర్ పూర్తి ధర రూ.33,970 కాగా 40 శాతం సబ్సిడీ అంటే రూ.13,588 పోను పశుపోషకులు చెల్లించాల్సింది రూ.20,382 మాత్రమేనని ఆయన వివరించారు. యంత్రాలు కావలసిన పశుపోషకులు సమీపంలోని పశువైద్యాధికారిని సంప్రదించాలని సూచించారు.

ప్రత్యేక అవసరాల పిల్లల పోటీల్లో బహుమతులు

క్రోసూరు: ప్రత్యేక అవసరాల పిల్లలకు సమగ్ర శిక్ష ఏపీ, అమరావతి నిర్వహించిన జిల్లాస్థాయి ఆటల్లో మండలంలోని దొడ్లేరుకు చెందిన విద్యార్థులు ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించినట్లు ఎంఈవో ఎం. గణేష్ శనివారం తెలిపారు. నరసరావుపేట శంకరభారతిపురం జెడ్పీ పాఠశాల క్రీడా మైదానంలో జరిగిన పోటీల్లో ఇంటలెక్చువల్ డిసేబిలిటీ, సెరిబ్రల్ పాలసీ, బ్లైండ్, ఆటిజం, లోకో మోటార్ డిజేబిలిటీ, హియరింగ్ ఇంపైర్‌మెంట్ గల వివిధ విభాగాల విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఇందులో మండలంలోని దొడ్లేరుకు చెందిన తిరుమలనాగేశ్వరరావు(ఇంటలెక్చువల్ డిసేబిలిటీ), ఉసర్తి మాధవి(హియరింగ్ ఇంపైర్‌మెంట్) రన్నింగ్, షాట్‌పుట్‌లలో ప్రతిభ కనబరిచి ప్రథమ,ద్వితీయ బహుమతులు పొందారని ఎంఈవో వెల్లడించారు.

బాబు అరెస్టు సక్రమమే



పార్టీ కార్యాలయం ముందు సమావేశమైన నాయకులు, కార్యకర్తలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి

- ప్రజలు తెలుసుకోవాలన్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- సీజీ సీఐడీకి మద్దతుగా సమావేశమైన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

నరసరావుపేట: చంద్రబాబు అరెస్టులో రాజకీయ నేపథ్యం, ఎటువంటి కక్ష సాధింపు లేదనే విషయం ప్రజలు తెలుసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి కోరారు. శనివారం ఏపీ స్కిల్ డెవలప్మెంట్‌కు చెందిన రూ.240 కోట్ల స్కాంలో సీబీసీఐడీ బాబును అరెస్టు చేయటంపై ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు గుంటూరు రోడ్డు పార్టీ కార్యాలయం ఎదుట కొద్దిసేపు మద్దతు సమావేశం నిర్వహించారు. చంద్రబాబు డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోపిరెడ్డి మాట్లాడుతూ పద్నాలుగేళ్ల సీఎంగా అనేక అక్రమాలు, స్కాంలు చేసి కోర్టుల నుంచి స్టేలు పొంది దొరగా తిరుగుతున్న చంద్రబాబునాయుడు ఈరోజు దొరికిన ఒక దొంగన్నారు.

ఎటువంటి ఆరోపణలు తనపై వచ్చినా హైకోర్టు, సుప్రీం కోర్టులకు వెళ్లి స్టేలు పొంది స్వేచ్ఛగా తిరుగుతున్నాడన్నారు. సుమారు రూ.240 కోట్లు తన అకౌంట్‌లో జమచేయించుకుని ఇప్పుడు రెడ్ హ్యాండెడ్‌గా దొరికాడ న్నారు. సీఎంగా ఉండగా స్కాం జరిగిందని, నిధు ల విడుదలకు అప్పటి చీఫ్ సెక్రటరీ, ఆర్థికశాఖ లోని ఇద్దరు సీనియర్ ఐఏఎస్‌లు వ్యతిరేకించారన్నారు. వారు బాబు ఆదేశాల మేరకే తాము డబ్బు లు విడుదల చేయటం జరిగిందంటూ నోట్ ఫైల్‌లో స్పష్టంగా పేర్కొన్నారన్నారు. దీనిలో రూ.370 కోట్లు రిలీజ్ చేయగా అందులో రూ.40 కోట్లు జీఎస్టీ పోను, మిగతా వాటిలో రూ.90 కోట్లు ఖర్చుచేసి మిగతా రూ.240 కోట్లు స్కాంకు పాల్పడ్డారన్నారు.

వీటిని షెల్ కంపెనీకి పంపించి వికాస్ అనే వ్యక్తి ద్వారా తన పీఏ అకౌంట్‌కు జమ చేయించి ఆ తర్వాత తన అకౌంట్‌కు జమ చేయించుకున్నాడన్నారు. దీనిపై ఇద్దరు సీనియర్ ఐఏఎస్‌లు వాంగ్మూలం కూడా ఇచ్చారన్నారు. ఇదంతా సీబీసీఐడీ తన దర్యాప్తులో తేల్చిన వాస్తవాలు, నిజాలన్నారు. ప్రజలు దీనిని గమనించాలన్నారు. ఇప్పటి అరెస్టు చేయటమనేది యాదృశ్చికమన్నారు. 2017–18లో తప్పు జరిగిందని ఆరోపణలు వచ్చాయని, 2019లో దర్యాప్తుకు ఆదేశాలు ఇవ్వటం జరిగిందని, 20–21వరకు దర్యాప్తు చేశారన్నారు. ఇప్పుడు ఐటీ శాఖ రూ.118 కోట్లు పట్టుకొని బాబుకు నోటీసులు ఇచ్చారన్నారు. తప్పుచేసిన వారెవరినీ వదిలిపెట్టే అవకాశం లేదన్నారు. అప్పటి ఐటీ మంత్రిగా ఉన్న నారా లోకేష్‌కు జైలు జీవితం తప్పదన్నారు. ఈ సంగతిని సీఎం జగన్, తమ పేర్లందరివీ ఎర్ర పుస్తకంలో సువర్ణ అక్షరాలతో రాసుకోవాలని లోకేష్‌కు సలహా ఇచ్చారు. తండ్రి, కుమారుడిని అరెస్టు చేస్తే రాష్ట్రంలో వర్షాలు పడతాయని, రైతులు సంతోషంగా ఉంటారన్నారు. చంద్రబాబు పుట్టిందే ఏప్రిల్ 20వ తేదీన అని, అందుకనే అతడి నైజం 420గా ఉంటుందన్నారు. తొలుత మామను వెన్నుపోటు పొడిచి అధికారంలోకి వచ్చాడని, ఆ తర్వాత బీజేపీతో పొత్తు, ఆ తర్వాత జనసేన, బీజేపీతో పొత్తుతో మళ్లీ అధికారంలోకి వచ్చాడన్నారు.

రింగ్‌మాస్టర్ పని ముగిసింది



రింగ్‌మాస్టర్ చంద్రబాబు పని ముగిసింది. 99 కంసుడి పాపాలు ముగిశాయి, స్కిల్ పేరుతో వంద పాపాలు చేశాడు. సీఎం జగన్‌పై కేసులు ఉన్నాయంటూ అనేక మంది టీడీపీ నాయకులు మాట్లాడారు. ఇవాల్టికి బాబు పాపం పండింది.

–ఎస్.సుజాతాపాల్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్

క్షుణ్ణంగా దర్యాప్తు



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్షుణ్ణంగా దర్యాప్తు చేసిన మీదటనే చంద్రబాబును అరెస్టు చేశారు. తమ నాయకుడు నిప్పు, పప్పు అంటూ మాట్లాడే టీడీపీ నాయకులు వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి. స్కాంలో నిజానిజాలు జనం అర్థం చేసుకోవాలి.

– వేముల శివ, వడ్డెర సంక్షేమ కార్పొరేషన్ జిల్లా సభ్యుడు

చాలా ఆలస్యమైంది



సీఎం జగన్ ఔన్నత్యంతో చీటింగ్ మనస్తత్వంతో రాజకీయాల్లో వెలుగుతున్న చంద్రబాబు అరెస్టు అయ్యారు. ప్రజలకు మేలు చేద్దామనే ఆలోచన చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేష్‌కు లేదు. మేలు చేసే సీఎం జగనన్నను పని చేయనీయట్లేదు.

–సతీష్, మాజీ కౌన్సిలర్

వేర్వేరు గ్రామాల్లో ఆర్డీవో పర్యటన

రొంపిచర్ల: మండలంలోని అన్నవరం పోలింగ్ బూత్ పరిధిలో ఆర్డీవో శేషిరెడ్డి శనివారం పర్యటించారు. ఒకే ఇంటి నెంబర్‌పై 10కి పైగా ఓటర్లు నమోదు, 100 ఏళ్లు ఉన్న ఓటర్ల వివరాలను ఆయన బీఎల్‌వోస్ నుంచి సేకరించారు. 6, 7, 8 ఫాంల విచారణ విధానాన్ని వివరించారు. వారి దగ్గర ఉన్న బేసిక్ రికార్డులను పరిశీలించాలన్నారు. ఎలాంటి అవకతవకలు లేకుండా విచారణ చేయాలని ఆయన బీఎల్‌వోస్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అంకారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఓటర్లతో మాట్లాడుతున్న ఆర్డీవో శేషిరెడ్డి

శావల్యాపురంలో...

శావల్యాపురం: గత 20 సంవత్సరాల నుంచి భూములు సాగు చేసుకుంటున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన ఎసైన్‌మెంటు భూములకు లబ్ధిదారుల సమగ్ర వివరాలన్నీ గ్రామాల వారీగా వీఆర్వోలు సేకరించి తదుపరి ఆన్‌లైన్ నమోదు చేయాలని నరసరావుపేట డివిజన్ రెవెన్యూ అధికారి మర్రిడ్డి శేషిరెడ్డి అన్నారు. శనివారం స్థానిక తహసీల్దారు కార్యాలయాన్ని ఆర్డీవో ఆకస్మికంగా సందర్శించారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ కులవృత్తులకు సంబంధించి (ఈనాం) భూములు సాగు చేసుకుంటున్న లబ్ధిదారులు ఆధారాలతో కూడిన సమగ్ర వివరాలన్నీ గ్రామాల వారిగా సేకరించి అనంతరం వీఆర్వో లాగిన్ తదుపరి ఉన్నతాధికారుల లాగిన్‌కు పంపాలన్నారు. అలాగే ఎసైన్‌మెంటు భూములకు సంబంధించి గ్రామాల వారీగా వివరాలు సేకరించి ఆన్‌లైన్ నమోదు చేయాలన్నారు. రీసర్వేకు సంబంధించి రైతులు ఎలాంటి అపోహలు నమ్మరాదని, విస్తీర్ణం తగ్గిన రైతులు వెబ్‌ల్యాండ్–2లో నమోదు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించినట్లు చెప్పారు. భూముల విస్తీర్ణం తగ్గిన రైతులు సమగ్ర ఆధారాలతో తహసీల్దారు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం ఈనాం, ఎసైన్‌మెంటు భూముల వివరాలపై చేయాల్సిన విధివిధానాల గురించి దిశ నిర్దేశం చేశారు. ఆయనతో పాటు డిప్యూటీ తహసీల్దార్లు వేముల వెంకట నాగరాజు, పి.నాసరయ్య, వీఆర్వోలు వీరవల్లి నాగ సంతోషలక్ష్మి, దూపాటి దేవమ్మ, అమల, రాధ, ఉప్పుటూరి చినమగయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్లను ఆదుకోవాలి

నాదెండ్ల: సమాజంలో అవహేళన, చిన్నచూపుకు గురౌతున్న ట్రాన్స్ జెండర్లను సమాజం ఆదుకోవాలని ఫ్రెండ్స్ న్యూ జెనరేషన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యులు చెప్పారు. సొసైటీ ఆధ్వర్యంలో శనివారం గణపవరం రాజీవ్‌గాంధీ కాలనీలో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ట్రాన్స్ జెండర్లకు పండ్లు, భోజన ప్లేట్లను అందించారు. ఈ సందర్భంగా ట్రాన్స్ జెండర్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షురాలు శ్వేత మాట్లాడుతూ గతంలో సొసైటీ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేయటం అభినందనీయమన్నారు. లెప్రసీ, పేద, మధ్యతరగతి, అనాధలకు కుట్టుమిషన్లు పంపిణీ చేసి జీవనోపాధి కల్పించారన్నారు. రోడ్డు పక్కనే జీవనం చేస్తున్న అనాధలను ఆదుకున్నారన్నారు. అనంతరం వారికి ప్లేట్లు, ఫ్రూట్స్ అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మంద్రు జ్ఞానయ్య, అవ్వారు సుబ్రహ్మణ్యం, సొసైటీ అధ్యక్షురాలు కె దుర్గ, చిలకలూరిపేట మద్దినగర్ ఏరియా ఆసుపత్రి ఐసీటీసీ కౌన్సిలర్ హనుమంతరావు, టీఏ వంశీ, విజయ ఉన్నారు.

దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోండి

చిలకలూరిపేటటౌన్: ప్రజలు దోమల వ్యాప్తి నివారణకు దోమతెరలు వాడాలని జిల్లా మలేరియా అధికారి కె.రవీంద్ర రత్నాకర్ చెప్పారు. పట్టణంలోని గుర్రాల చావిడి ప్రాంతంలో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఇంటి పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు వ్యాప్తి చెందకుండా తాగి పడవేసిన కొబ్బరిబొండాలు, నీరు నిల్వలేకుండా చూసుకోవాలని సూచించారు. దోమకాటు ద్వారా డెంగీ, మలేరియా తదితర వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో చిలకలూరిపేట సబ్ యూనిట్ ఆఫీసర్ ఆర్‌సీహెచ్ నారాయణ, సిబ్బంది చెలమారెడ్డి, శివయ్య, దిలీప్, కోటేశ్వరరావు, జిలాని పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

వినుకొండ (నూజెండ్ల): ప్రభుత్వం ఒకవైపు సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే మరోవైపు అభివృద్ధి కూడా సమానంగా చేపడుతున్నట్లు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. వినుకొండలో శనివారం ఆయన అభివృద్ధి పనులకు ప్రారంభించారు. పట్టణంలోని వెల్లటూరు రోడ్డులో జగనన్న కాలనీకి ముఖద్వారం నిర్మాణాని భూమిపూజా కార్యక్రమం నిర్వహించారు. అలాగే కారంపూడి రోడ్డులో విద్యుత్ సబ్ స్టేషనులో నూతనంగా నిర్మించిన ఈఆర్‌సీ నూతన భవనం ప్రారంభించారు. ప్రజలకు మెరుగైన విద్యుత్ సౌకర్యం అందించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జున రావు, ఎంపీపీ జయశ్రీ వెంకట్రామి రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లు యాదవ్ మండల కన్వీనర్లు దండు చెన్నయ్య, నక్కా నాగిరెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గంధం బాలిరెడ్డి, నరాలశెట్టి శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ ములకా రామ తులసిరెడ్డి, అంజి రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, కౌన్సిలర్లు పాపసాని బ్రహ్మయ్య, సానాల పుల్లయ్యలతోపాటు పలువురు పార్టీ నాయకులు అధికారులు పాల్గొన్నారు.



జగనన్న కాలనీకి ఆర్చీ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బొల్లా

మాజీ ఎమ్మెల్యే జీవీ అరెస్టు

వినుకొండ(నూజెండ్ల): చంద్రబాబు అరెస్టుకు నిరసనగా ఆందోళన చేపట్టిన మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులుతోపాటు పలువురు టీడీపీ నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈపూరు మండలం ముప్పాళ్లలో టీడీపీ భవిష్యత్‌కు భరోసా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రాత్రి వెళ్లిన ఆయన అక్కడే బస చేశారు. ఉదయం ఆరు గంటలకు అక్కడకు వెళ్లిన పోలీసుల కప్పి ఆంజనేయులు అక్కడి నుంచి మండల కేంద్రమైన ఈపూరులో ధర్నా చేపట్టారు. పోలీసులు అక్కడ జీవీని అదుపులోకి తీసుకుని బొల్లాపల్లి స్టేషనుకు తీసుకెళ్లారు.

గిజిగాడి గూళ్లు..



సెల్‌ఫోన్ వినియోగం పెరిగి రేడియేషన్ కారణంగా పక్షులు అంతరిస్తున్నాయి. సెల్ ఫోన్ సిగ్నల్స్ కారణంగా గాల్లో స్వేచ్ఛగా ఎగిరే విహంగాల ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. గతంలో ప్రతి ఇంటి పెరట్లో ఉదయాన్నే పక్షుల కువకువలు వినిపించేవి. ఉదయాన్నే చెట్ల కొమ్మలపై నుంచి ఆహార వేటలో బయలు దేరి సాయంత్రం తిరిగి గూళ్లకు చేరేవి. అయితే రానురాను పక్షుల సంఖ్య అంతరిస్తోంది. కొన్ని పక్షులు జీవన విధానం మనిషికి ఎంతో ఉత్సుకతకు రేకెత్తిస్తోంది. గిజిగాడు పక్షులు ప్రకృతిలో కనిపించే అద్భుతమైన ఇంజనీర్లు. చెట్ల కొమ్మల అంచున తమ గూడును విశిష్టంగా ఇవి కట్టుకుంటాయి. విరిగిన కొమ్మలు, ఎండిన ఆకులు, దూదిని సేకరించి ఇవి తమ గూడును సుందరంగా నిర్మించుకుంటాయి. గణపవరం గ్రామం రాజీవ్‌గాంధీ కాలనీలో ఓ ఈత చెట్టుకు పెద్ద సంఖ్యలో గిజిగాడి గూళ్లు వెలిశాయి. అటుగా వచ్చివెళ్లే వారిని ఇవి విశేషంగా అలరిస్తున్నాయి. –నాదెండ్ల

జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణం పరిశీలన

నరసరావుపేట: వినుకొండ రోడ్డులోని జగనన్న కాలనీని మున్సిపల్ కమిషనర్ జీ.రామ్మోహనరావు శనివారం పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న ఇళ్లను పరిశీలించి జరుగుతున్న తీరును యజమానులను అడిగి తెలుసుకున్నారు. త్వరగా ఇళ్లను పూర్తిచేసుకొని ప్రభుత్వం నుంచి వచ్చే లబ్ధి పొందాలని కోరారు. విద్యుత్ సౌకర్యం, తాగునీటి వసతి, బోర్ల పరిస్థితి, రోడ్లును పరిశీలించారు. పురపాలక సంఘం తరఫున లబ్ధిదార్లకు అందాల్సిన మౌలిక సదుపాయాలను కల్పించటం జరుగుతుందన్నారు. ఆయన వెంట సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.



కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్లను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

అభివృద్ధి అంటే చేసి చూపించాలి

ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

ఈపూరు: అభివృద్ధి అంటే చేసి చూపించాలని అని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. శనివారం మండల కేంద్రంలో గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రాలను ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లిఖార్జున రావులు ఇరువురూ కలిసి ప్రారంభోత్సవం చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ నాడు–నేడు మనబడి పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ చోటు చేసుకుందన్నారు. ప్రతి గ్రామంలో గ్రామ సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు ఏర్పాటు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రజలు తమ అవసరాలకు మండల కార్యాలయాలు తిరగకుండా వారి గ్రామాల్లోని ఇంటి ముంగిటకి వలంటీర్ల వ్యవస్థ ప్రతి పనిని 24 గంటల వ్యవధిలో జరిగేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశ చరిత్రలో ఎక్కడా జరగలేదన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో అభివృద్ధిని రాష్ట్రాన్ని 30 సంవత్సరాలు వెనకకు నెట్టిందన్నారు. సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని సంక్షేమ బాటలో నడపిస్తుంటే, ఓర్వలేక టీడీపీ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు ఆయన తనయుడు, దత్తపుత్రుడు ముగ్గురు అబద్ధాలతో ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. కోట్ల రూపాయల కుంభకోణంలో ఇరుక్కుని జైలుకు వెళుతున్న చంద్రబాబు నాయుడు సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని దొంగ అనటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇప్పటికి ఒక కుంభకోణం బయటకు పడిందని, వేల కోట్ల కుంభకోణాలు త్వరలో బహిర్గతం కానున్నట్లు వెల్లడించారు. కంపెనీలు లేకుండానే ప్రభుత్వ సొమ్మును తన కంపెనీలకు మళ్లించుకొని వేలకోట్లు స్కాములు చేసిన ఘనత చంద్రబాబు నాయుడుదే అన్నారు. చంద్రబాబు, ఆయన తనయుడు ఇరువురు జైలుకు వెళ్ళక తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పల్లమీసాల చెంచయ్య, జెడ్పీటీసీ చౌడయ్య, మండల కన్వీనర్ కొపెల దేవరాజ్, పార్టీ నేతలు కాకనబోయిన శ్రీను, బోండా శ్రీను, శాఖమూరి బుచ్చయ్య, ఈపూరు సొసైటీ అధ్యక్షులు బొల్లా బుజ్జి, గోనుగుంట్ల వెంకట హనుమయ్య, జానయ్య, మూలె వెంకిరెడ్డి పాల్గొన్నారు.



శిలాఫలకం ఆవిష్కరణలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, మాజీ ఎమ్మెల్యే మక్కెన

పోలింగ్ స్టేషన్ల పరిశీలన

వినుకొండ(నూజెండ్ల): జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పోలింగ్ స్టేషన్ల పరిశీలన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈఆర్‌వో డిప్యూటీ కలెక్టర్ శ్రీరాములు, ఏఈఆర్‌వో తహసీల్దార్ కిరణ్ కుమార్‌లు కలసి గోనుగుంట్లవారిపాలెం 223 పోలింగ్ స్టేషనునుంచి నాగులవరం మధ్యలో గల 238 స్టేషన్ల వరకు పరిశీలన చేశారు. ఈసందర్భగా శ్రీరాములు మాట్లాడుతూ నియోజకవర్గంలోని 99 పోలింగ్ స్టేషన్లను పరిశీఇంచి వసతి సౌకర్యాలు, ఇతర సమస్యలపై చర్చించినట్లు తెలిపారు. అనంతరం భూత్‌లెవెల్ అధికారులతో మాట్లాడిన ఆయన ప్రజలనుంచి అభ్యంతరాలు ఏమైనా వస్తే ఈనెల 15 వతేదీలోపుగా వినుకొండ తహసీల్దార్ కార్యలయంలో ఫిర్యాదు చేశాలని ఆదేశించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జాలాదిలో...

యడ్లపాడు: మండలంలోని జాలాది గ్రామాన్ని శనివారం నియోజకవర్గ ఎన్నికల అధికారి వసంత బాబు తహసీల్దార్ జీ.సుజాతతో కలిసి సందర్శించారు. గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని 106, 107 పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికుల నుంచి పోలింగ్ కేంద్రంకు సంబంధించి వారి అభిప్రాయాలను సేకరించారు. కార్యక్రమంలో ఆర్ఐ చక్రవర్తి, వీఆర్వో కేఏ చారి, 107 బీఎల్‌వో బుల్లెమ్మాయి స్థానికులు పాల్గొన్నారు.



జాలాదిలో ప్రజాభిప్రాయాన్ని తెలుసుకుంటున్న నియోజకవర్గ ఎన్నికల అధికారి

కేజీబీవీలో భోజనం నాణ్యతపై సమగ్ర విచారణ: డీఈవో

గోళ్ళపాడు(ముప్పాళ్ల): కేజీబీవీ పాఠశాలలో భోజనం నాణ్యతపై సమగ్ర విచారణ జరిపి నివేదిక అందివ్వాలని జిల్లా విద్యాశాఖాధికారి శామ్యూల్ ఆదేశించారు. మండలంలోని గోళ్లపాడులో కేజీబీవీ పాఠశాలను శనివారం తనిఖీ చేశారు. పాఠశాలలో ఆహారం సరిగ్గా ఉండటం లేదని శుక్రవారం ఎంఈవోకు అందిన ఫిర్యాదు మేరకు విద్యార్థినులతో మాట్లాడి సమస్యల్ని తెలుసుకున్నారు. సోమవారం నుంచి మెనూ ప్రకారం ఆహారం అందివ్వడం లేదని గుర్తించారు. మజ్జిగ సరిగ్గా ఉండటం లేదని, కూరలు కూడా ఉడకకుండా వడ్డిస్తున్నారని, పలు సమస్యల్ని విద్యార్థినులు డీఈవో దృష్టికి తెచ్చారు. మెనూ ప్రకారం ఆహారం అందించాలని, ఇబ్బందులు తలెత్తితే చర్యలు తీసుకుంటామని పాఠశాల ప్రత్యేకాధికారిని మందలించారు. సరుకుల సరఫరాలో సమస్యలుంటే తమకు దృష్టికి తేవాలని చెప్పారు. విద్యార్థుల్ని ఇబ్బందులు పెట్టవద్దని ఉపాధ్యాయినులకు సూచించారు. ప్రభుత్వం పేద విద్యార్థుల కోసం అనేక సౌకర్యాలు కల్పిస్తోందని, వాటికి తూట్లు పొడిచేలా పని చేయకూడదని తెలిపారు. అనంతరం విద్యార్థినులకు ఆహారాన్ని వడ్డించారు. ఆయనతో పాటు కస్తూరిబా పాఠశాలల అసిస్టెంట్ ఏసీడీ మాధురి, ఏడీ నాంచారయ్య ఉన్నారు.



పాఠశాలలో విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఈవో శామ్యూల్

రాజీ మార్గమే రాజ మార్గం

సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి నాగ వెంకటలక్ష్మి

సత్తెనపల్లి: రాజీ మార్గమే రాజ మార్గమని సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్ డి. నాగ వెంకటలక్ష్మి తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌కు సత్తెనపల్లి పరిధిలోని నాలుగు న్యాయస్థానాల్లో అనూహ్య స్పందన వచ్చిందన్నారు. లోక్ అదాలత్ విజయవంతానికి న్యాయవాదులు, పోలీసుల కృషి మరవలేనిదని తెలిపారు. కక్షిదారుల్లో కూడా బాగా అవగాహన పెరిగిందని చెప్పారు. మొత్తం మూడు బెంచ్‌లుగా నిర్వహించారు. ఒకటో బెంచ్‌కు న్యాయమూర్తిగా సీనియర్ సివిల్ జడ్జి నాగ వెంకటలక్ష్మి, సభ్యులుగా న్యాయవాది నలబోతు వెంకటేశ్వర్లు వ్యవహించారు. రెండో బెంచ్‌కు సత్తెనపల్లి ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి కె.ప్రశాంతి, సభ్యులుగా న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు, మూడో బెంచ్‌కు సత్తెనపల్లి 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి తౌషిద్ హుస్సేన్, సభ్యులుగా న్యాయవాది బి.అమర్ నాయక్ వ్యవహరించారు. మొత్తం 709 కేసులు పరిష్కారం కాగా వాటిల్లో సివిల్–18, హెచ్ఎంటపీ–1, పీఎల్‌సీఎంసీ–10, క్రిమినల్–146, డీవీసీ–4, ఎంసీ–8, ఎన్ఐ యాక్ట్–3, 498ఏ–3, ఎస్టీసీ–516 ఉన్నాయి. వీటి ద్వారా రూ.1,16,51,653 నగదు చేతులు మారింది.



పట్టణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి నాగ వెంకటలక్ష్మి

ప్రభుత్వ బీమా పథకాలు బాధితులకు వరం

నకరికల్లు: ప్రభుత్వ సంక్షేమ పథకాలు బాధితులకు వరంలాంటివని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చీమలమర్రి, దేచవరం, రూపెనగుంట్ల గ్రామాల్లోని సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులకు ప్రమాద బీమా పథకాలపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీమా పథకాలకు లబ్ధిదారుల నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. జేసీఎస్ మండల ఇన్‌చార్జి మేడం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలు అందించడం మనందరి బాధ్యతని తెలిపారు. ప్రధానంగా బీమా పథకాలు కుటుంబాలకు అండగా ఉంటాయని, తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ నమోదు చేసుకునేలా చూడాలని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచులు వెంకటరావు, రమణారెడ్డి, సాంబయ్య, రామారావు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నరసరావుపేట డివిజన్
99122 25439 (నరసరావుపేట)
90105 83302
90102 03704 (చిలకలూరిపేట)
97054 44152 (వినుకొండ)
Office mail : sakshigntadvt@gmail.com